# బ్లో అప్

~ హూలియో కొర్తసార్ (అనువాదం: వెంకట్ సిద్ధారెడ్డి)



**సినిమా వెనుక కథ:** బ్లో అప్

**రచన:** హూలియో కొర్తసార్

**అనువాదం:** వెంకట్ సిద్ధారెడ్డి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: డిసెంబరు 2013

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=329

©Author.
**What can you do with this document?**
Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use
**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

చాలా రోజుల క్రితం నేను బ్లో-అప్ అని ఒక ఇటాలియన్ చూశాను. ఆంటోనియోని ఆ సినిమా కి దర్శకుడు. ఆ తర్వాత కాలంలో ఈ సినిమా చాలా సార్లు చూసినప్పటికీ, ఇప్పటికీ ఆ సినిమా అర్థమయ్యీ, అర్థం కానట్టే ఉంటుంది. ఈ సినిమా గురించి మరిన్ని విశేషాలు తెలుసుకునే ప్రయత్నంలో నాకు తెలిసొచ్చిందేంటంటే, "Las Babas del Diablo" అనే కథ బ్లోఅప్ సినిమాకి మూలం అని. ఈ కథలోని కొన్ని అంశాలను మాత్రమే తీసుకుని కొన్ని సరికొత్త అంశాలను జోడించి బ్లోఅప్ సినిమా తీశారు. అర్జెంటినా దేశానికి చెందిన కొర్తసార్ ఈ కథా రచయిత. అసలీ కథేంటో చూద్దామని ఆ కథ యొక్క ఇంగ్లీష్ అనువాదం చదివాను. చదువుతున్నది ఇంగ్లీషే కానీ ఒక్క ముక్క అర్థం కాలేదు. కానీ ఇందులో నాకర్థం కానిది ఏదో ఉందని మాత్రం అర్థమయింది. అసలా కథ రాసిన విధానం గమ్మత్తుగా ఉంటుంది. అంతకుముందెప్పుడూ అలాంటి ప్రయోగం చూడలేదు. షార్ట్ స్టోరీస్ ఆధారంగా రూపొందిన చలనచిత్రాల మూల కథలను ఎన్నుకుని తెలుగులోకి అనువదించాలన్న ప్రయత్నంలో మొదటగా నాకు కొర్తసార్ కథ గుర్తొచ్చింది. దీంతో మొదలుపెట్టేద్దామనుకుని మరోసారి చదివాను. అంతకుముందుకంటే ఇంకొంచెం ఎక్కువ అర్థమైంది కానీ పూర్తిగా అర్థం కాలేదు. అది కథలోని లోపం కాదు. కొర్తసార్ రచనా శైలి అంతే! బోర్హెస్ అనే మరో రచయిత మాటల్లో చెప్పాలంటే...

*"No one can retell the plot of a Cortázar story; each one consists of determined words in a determined order. If we try to summarize them, we realize that something precious has been lost." (Jorge Luis Borges)*

కథేంటో చెప్పడమే కష్టమైన కొర్తసార్ కథ ని అనుదించాలనుకునే ధైర్యం నాకెలా వచ్చిందో తెలియదు. కానీ అనువదించడం మొదలుపెట్టిన తర్వాత ప్రతి రోజూ నన్ను నేను తిట్టుకున్న సందర్భాలే ఎక్కువ. చాలా కాంప్లెక్స్ కథ కి నెరేటివ్ కూడా అంతే కాంప్లెక్స్ గా ఉన్న కథ. చాలా సార్లు నావల్ల కాదని ఆపేద్దామనుకున్నాను కూడా. మొత్తానికి ఏదో చేసి పూర్తి చెయ్యగలిగాను. అంతా అయ్యాక నాకు బ్లోఅప్ సినిమా మాత్రమే కాదు, కథ కూడా పూర్తిగా అర్థమైనట్టే అనిపించింది. కానీ ఏమర్థమయింది అని ఎవరైనా అడిగితే మాత్రం వివరించలేనటువంటి అనుభవం అది. ~ వెంకట్ సిద్ధారెడ్డి

# బ్లో అప్

ఇది ఎలా చెప్పాలో ఎప్పటికీ తెలియదు. ప్రయత్నించి ఉత్తమ పురుషలోనో మధ్యమ పురుషలోనో చెప్దామా, లేదా ప్రథమ పురుషలో చెప్దామా? లేదా చివరికెలాగూ వృథాప్రయాసగానే తేలే సరికొత్త ప్రక్రియ ఎందులోనన్నా మొదలుపెడదామా! ఒక వేళ ఎవరైనా ఇలా చెప్తే ఎలా ఉంటుంది: "నేను నిన్న చంద్రోదయాన్ని చూడబోతున్నాను," లేదా: "మనందరం కలిసి నా కళ్ళు రేపు పొడిచేశాం", లేకపోతే ఇంకొంచెం కొత్తగా: "సుందరీ నువ్వే ఆ మేఘానివి... నీ, నా, మన, వారి, అతని ముందుగా తరలిపోయే మేఘానివి". ఛీ...పరమ చెత్తగా ఉంది. ఎంత కొత్తగా చెప్పాలనుకున్నా ఇది చెప్పడం మాత్రం అంత సులభం కాదు.

చెప్పడానికి సిద్ధమై కూర్చుని, మళ్లీ ఫ్రిజ్ లో ఉన్న బీర్ తాగాలనిపించి లేచి వెళ్లినప్పుడు, ఒకవేళ టేబుల్ మీదున్న టైప్ రైటర్ దానిపాటికదే టైప్ చేసుకుంటే పోతే అంతకంటే సుఖం ఏదీ ఉండదు. కానీ అలాంటి సౌకర్యం లేదని నాకు బాగా తెలుసు. నేనిక్కడ్నుంచి లేచిన మరుక్షణం ఈ టైప్ రైటర్ ఇక్కడే రాయిలా నిశబ్దంగా కూర్చుంటుంది. టేబుల్ మీద నిశబ్దంగా, నిశ్చలంగా కూర్చుని ఉన్న ఈ కెమెరా ని చూస్తే ఆ విషయం మరింత గట్టిగా రూఢీ అవుతుంది. నీకంటే, నాకంటే, ఆ అందమైన అమ్మాయికంటే, ఆ మేఘాలకంటే – ఒక మెషీన్ గురించి మరో మెషీన్ కే ఎక్కువ తెలిసే అవకాశం ఉంది. కాబట్టి, వేరే మార్గం లేదు. ఇది ప్రపంచానికి చెప్పాలని అనుకున్నాక, మనలో ఎవరో ఒకరు రాసి తీరాల్సిందే. ఆ రాసేది నేనైతే మరీ మేలు; ఎలాగూ మిగిలిన వాళ్లలా రాజీపడలేక చచ్చాను కాబట్టి, నాకు మేఘాలు తప్ప మరేవీ కనిపించవు కాబట్టి, నా ఆలోచనలకు ఎవరూ భంగం కలిగించలేరు కాబట్టి (అదిగో మరో మేఘం.... బూడిద రంగు అంచులతో అటుగా వెళ్తోంది), నేను రాస్తున్నప్పుడు ఎవరూ ఆటంకం కలిగించరు కాబట్టి, నేను ఎలాగూ చచ్చినట్టే కాబట్టి (నేను బతికే ఉన్నాను. అనవసరంగా అపార్థం చేసుకోకండి. సమయం వచ్చినపుడు మీకే అర్థమవుతుంది. ఎక్కడో దగ్గర మొదలు పెట్టాలి కాబట్టి ఇక్కడ మొదలు పెడ్తున్నాను. ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు మొట్టమొదట్లో మొదలుపెట్టడమే మంచిదని మీకే తెలుస్తుంది.)

ఆలోచిస్తే ఇదంతా నేనెందుకు చెప్పాలని కూడా అనిపిస్తుంది. కానీ మనం చేసే పనులన్నింటికీ కారణాలేంటని ఆలోచిస్తూ కూర్చుంటే, ఎవర్నుంచో అందిన డిన్నర్ పిలుపును

ఎందుకు అంగీకరించామనో (అదిగో ఒక పావురం ఎగిరిపోతోంది.... కానీ ఎందుకో అది పిచుకలా అనిపించింది) లేదా, ఎవరైనా ఒక మంచి జోక్ చెప్పగానే కడుపులో ఏదో ఉబ్బరంలా మొదలై అప్పటికప్పుడు పక్క ఆఫీసులోకి వెళ్లి ఆ జోక్ ఇంకొకరికి చెప్పే వరకూ ఎందుకు కుదురుగా ఉండలేకపోయామో ఆలోచిస్తూ కూచుంటే, ఏం జవాబు తడుతుంది; ఎందుకో అలా చేయటం బాగుంటుందని, అంతే. ఎందుకంటే ఎవరూ చెప్పలేరు, కాబట్టి చేయాల్సిందల్లా ఏమిటంటే, అన్ని సంకోచాలూ మీమాంసలూ పక్కన పెట్టేయటమే. ఎవరైనా ఊపిరి పీల్చటం గురించీ, బూట్లు తొడుక్కోవటం గురించీ సిగ్గుపడతారా; అవి మనం సహజంగా చేసే పనులు, అంతే. అలాగే ఏదన్నా వింత జరిగినపుడు, అంటే నువ్వు తొడుక్కునే బూట్ల మీద సాలీడు కనిపించినపుడో, నువ్వు ఊపిరి పీల్చుకున్నప్పుడు నీ లోపల ఏదో బద్దలయినట్టో అనిపించినపుడో – అప్పుడు జరిగిందేమిటో చెప్పుకోవాలి, మీ ఆఫీసులో కొలీగ్స్ తోనో, లేదా హాస్పిటల్ లో డాక్టర్‌తోనో చెప్పుకోవాలి. డాక్టర్, నేను ఊపిరి తీసుకున్నప్పుడల్లా.... అంటూ చెప్పి తీరాల్సిందే, నిన్ను నిలవనివ్వని నీ కడుపులో ఉబ్బరాన్ని తీర్చుకోవాల్సిందే.

సరే. ఇప్పుడు దీని గురించి చెప్పుకోవాల్సిందే అనే గట్టి నిర్ణయానికి వచ్చాం కాబట్టి ఒక పద్ధతి ప్రకారం మొదలుపెడదాం. నవంబర్ ఏడవ తేది. ఆదివారం. అంటే సరిగ్గా ఒక నెల క్రితం ఒక భవనంలోని ఐదో అంతస్థులో మన కథ మొదలవుతుంది. ఐదో అంతస్థునుంచి మెట్లు దిగి బయటకొచ్చి ప్యారిస్ వీధిలోని ఆ ఆదివారపు ఎండలో నిలబడితే – నవంబర్ నెలలోనూ ఇంత ఎండా? అని ఆశ్చర్యపడుతూ నగరం మొత్తం చుట్టివెయ్యాలని, చూసిన దృశ్యాలను ఆకలిగా కెమెరా లో (నేనొక ఫోటోగ్రాఫర్ ని) బంధించాలనీ అనిపించకమానదు. నేను చెప్పాలనుకున్నది చెప్పడానికి ఒక విధానం కావాలి; మార్గం కావాలి. లేదంటే కష్టం. మళ్లీ మళ్లీ ఇదే విషయం చెప్తున్నానన్న భయం నాకు లేదు. ఈ విషయం చెప్పడం ఎందుకింత కష్టమంటే ఇది ఎవరు చెప్తున్నారో ఎవరికీ తెలియదు. ఎందుకంటే నేను నేనేనా అని నా అనుమానం. నేను నేను కాకపోతే ఇది చెప్తున్నదెవరు? కళ్లతో చూసింది మాత్రమే ఇక్కడ చెప్పుకుందామా? అసలు కళ్లతో చూసిందంతా నిజమేనా? (మేఘాలు, అప్పుడప్పుడూ అటుగా ఎగురుతోన్న పావురాలు) నా నిజం, నీ నిజం ఒకటేనా? లేదా ఏదో ఒకటి చెప్పేయాలనే తపనతో నేనిలా చేస్తున్నానా? ఏదోఒకటి! ముందైతే చెప్పేస్తాను.

మెల్లగా మొదలు పెడదామనే ఉంది. కానీ నేనిప్పుడు రాస్తున్న దాంట్లో ఎప్పుడో చెప్పాల్సిన విషయాలు ఇప్పుడే ముంచుకొచ్చేస్తున్నాయి. నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇప్పటి నా ఆలోచనలను అవి తోసిపుచ్చితే నేనేం చెయ్యను? ఈ మేఘాలు కనిపించడం మానేసి, మరేదైనా నా ఆలోచనలకు భంగం కలిగిస్తే (ఏదో ఒకటి రావడం, ఈ మేఘాలు కదలడం, అప్పుడప్పుడూ ఒక పావురాయి ఎగరడం...ఇవేవీ ఆగవు)....ఒక వేళ ఇంకేదైనా జరిగితే ఈ వాక్యాన్ని ఎలా పూరించను? కానీ ఇలా ప్రశ్నలడుక్కుంటూ పోతే నేనేమీ చెప్పలేనని నాకు తెలుసు. బహుశా నేను చెప్పేది ఎవరో ఒకరి ప్రశ్నకు సమాధానమవుతుందేమో?

ఆ రోజు నవంబర్ ఏడవ తేది. ఆదివారం. వృత్తి రీత్యా అనువాదకుడు, ప్రవృత్తి రీత్యా ఫోటోగ్రాఫర్ అయిన రోబర్టో మైఖేల్, ప్యారిస్ లోని 11 వ నెంబరు వీధి నుంచి బయల్దేరాడు (అవిగో కదిలిపోతున్న రెండు వెండి మబ్బులు). ప్యారిస్ విశ్వవిద్యాలయంలో మూడు వారాలుగా అనువాదపు పనులు చేసి ఆ రోజు నగరం సందర్శించడానికి బయల్దేరాడు అతను. ఆరోజు గాలి బలంగా వీస్తోంది. ప్యారిస్ వీధుల్లో గాలి వీయడమనేది చాలా అరుదైన సందర్భం; వీధుల్లోనుంచి మెలికలు తిరుగుతోన్న గాలి దారి పొడవున వున్న ఇళ్ల కిటికీలను చేరి, పరదాలను దాటి, వాటి వెనుక ఉన్న ఆడవాళ్ళను చేరుతోంది. వాళ్ళేమో ఈ మధ్యన వాతావరణం మరీ ఇంత అనూహ్యంగా మారిపోయిందే అని మాట్లాడుకుంటున్నారు. గాలే కాదు సూర్యుడు కూడా ఆ రోజు తెగ రెచ్చిపోతున్నాడు. గాలితో పోటీ పడుతున్నాడు. ఈ వాతావరణంలో నన్ను ఫోటోలు తియ్యనీకుండా ఆపడం ఎవరి తరమూ కాదు. మ్యూజియం భవనం చుట్టూ నడుస్తూ కొన్ని ఫోటోలు తీశాను. అప్పటికి సమయం పది గంటలు కూడా కాలేదు. ఈ కాలంలో పదకొండయితే గానీ పూర్తిగా వెలుగు రాదు. కాసేపు కాలక్షేపం కోసం నగర వీధుల్లో నడిచాను; నగరంలోని ప్రఖ్యాత ప్రదేశాలన్నీ చూసుకుంటూ అలా ఎంత సేపు తిరిగానో తెలియదు. మధ్యలో ఒక చోట ఆగి కాసేపు నాకిష్టమైన కవితను నెమరు వేసుకున్నాను (నిజానికి గుర్తు చేసుకోవాలనుకున్నది వేరే కవిత. కానీ జ్ఞాపకానికొచ్చింది మాత్రం మరొకటి. ఈ మైఖేల్ ఇంతే. వీడో పెద్ద వెధవ). అలా నడుస్తూ కాసేపటికి నగరం మధ్యలోనుంచి పారుతున్న నది వద్దకు చేరుకున్నాను. కాసేపటికి గాలి స్తంభించింది. సూర్యకాంతి రెండు రెట్లు అధికమైంది. ఆ సమయంలో నది ఒడ్డున ఒక పిట్టగోడమీద కూర్చున్న నాలో అమితోత్సాహం నెలకొంది.

జీవితంలో ఎదగాలంటే ఫోటోగ్రఫీ చాలా అవసరం. చిన్న వయసులోనే పిల్లలకు ఫోటోగ్రఫీ నేర్పించడం మంచిది. ఫోటోగ్రఫీ ద్వారా పిల్లల్లో క్రమశిక్షణ అలవరుతుంది; ప్రపంచంలోని అందాలపై దృష్టి మరలుతుంది; కెమెరాను స్థిరంగా పట్టుకోవడమూ అలవాటవుతుంది. భవిష్యత్తులో మంచి ఫోటోగ్రాఫర్లగా మారే అవకాశమూ ఉంది. సెలబ్రిటీలను వెంబడించి, వారి ఫోటోలను మసక మసకగా తీసే ఫోటోగ్రాఫర్ల గురించి కాదు నేను చెప్పేది. ఫోటోగ్రఫీ అనేది అన్ని విధాలుగా శ్రద్ధ కలిగి ఉండాల్సిన విద్య. చేతిలో పాల సీసానో, రొట్టె ముక్కనో పట్టుకుని, జడలెగరేసుకుంటూ పరిగెడ్తున్న చిన్నపిల్ల ఆనందాన్ని ఒక ఫోటోగ్రాఫ్ లో భద్రపరచాలి; పాత రాతి ని ఢీకొని సూర్య కిరణాల కాంతి చెల్లాచెదరవుతుండే దృశ్యాన్నీ లిప్తపాటులో బంధించాలి. ఫోటోగ్రాఫర్ కెమెరా ద్వారా ప్రపంచాన్ని చూస్తాడు; కానీ కెమెరా తన దృష్టిని ఫోటోగ్రాఫర్ పై విధించకుండా జాగ్రత్త పడాలని మైఖేల్ కి తెలుసు (ఇప్పుడొక నల్లటి మేఘం తరలిపోతోంది), కానీ అతనకి తన మీద విశ్వాసం తక్కువ. కెమెరా కి లోబడి అది విధించిన ఫ్రేమ్ లో మాత్రమే అతను చూడగలడు. ప్రస్తుతం (ఎంత మంచి పదం ఇది. కానీ అంత గొప్ప అబద్ధమో కూడా!) నేను నది ఒడ్డున మెట్ల మీద కూర్చుని, నదిలో మెల్లగా కదులుతున్న రంగు రంగుల పడవలను చూస్తున్నాను. కానీ ఆ దృశ్యాలేవీ ఫోటోలుగా తీయాలనిపించలేదు; కాలప్రవాహంలో చలనం లేకుండా నేను కొట్టుకుపోతున్నట్టే ఆ దృశ్యాలూ నా కళ్లముందు నుంచి కదలిపోతున్నాయి. ఆ సమయంలో గాలి సైతం స్తంభించింది.

ఆ తర్వాత, నేను కాసేపు నది ఒడ్డున నడుస్తూ కాసేపు హాయిగా తిరిగాను. అలా నడుస్తూ ఉండగా పక్కనే ఉన్న పార్క్ పిల్లగాలులతో నన్ను అహ్వానించడంతో లోపలకి నడిచాను. రోడ్ కి దూరంగా ఉన్నప్పటికీ, నిండు ఆకాశాన్ని, ప్రవహిస్తున్న నది ని చేతులు తెరిచి అహ్వానిస్తున్నట్టుగా ఉందా పార్క్. అక్కడ నేను, మరో జంట తప్ప ఇంకెవరూ లేరు; అప్పుడప్పుడూ ఎగురుతూ, మళ్ళీ తిరిగి అక్కడే వాలుతున్న కొన్ని పావురాలు మాత్రం ఉన్నాయి. నేను ఎత్తుగా ఉన్న ఒక పిట్ట గోడ పైకి ఎక్కి సూర్యుడి వైపు తిరిగి కూర్చున్నాను; ఎండ నా మోహాన్ని, నా చేతులను వెచ్చగా తాకింది. నాకసలు ఫోటోలు తియ్యాలన్న కోరికే లేదు. ఏదో ఒకటి చేసి కాలక్షేపం చెయ్యాలి కాబట్టి జేబులోనుంచి సిగరెట్ తీశాను. వెలిగించిన అగ్గిపుల్లనుంచి మంట సిగరెట్ కొనను తాకుతుండగా అనుకుంటాను – ఆ అబ్బాయిని నేను మొదటి సారిగా చూశాను.

మొదట్లో వాళ్లిద్దరినీ చూసి నేను ప్రేమికులేమో అనుకున్నాను. కానీ చూసే కొద్దీ వాళ్లిద్దరూ తల్లీ కొడుకుల్లా కనిపించారు. కానీ మళ్లీ కాసేపటికే వాళ్లిద్దరూ జంట పక్షులే అనిపించింది. నాకూ పెద్దగా ఏమీ చేసేదేమీ లేకపోవడంతో చాలా సేపు ఆ అబ్బాయినే చూస్తూ కూర్చున్నాను. ఆ అబ్బాయి ని చూస్తే కుందేలు పిల్ల గుర్తొచ్చింది. ఎందుకో భయపడుతున్నాడు. పేంట్ జేబుల్లో చేతులు పెట్టుకోవడం, ఇంతలోనే తీసివేయడం, వెంటనే చేతులతో జుట్టు పైకి తోసుకోవడం. నిలబడిన చోట ఉండలేకపోతున్నాడు. కొంచెం సిగ్గు పడుతున్నాడు. భయం భయంగా ఎప్పుడు వెనక్కి వెళ్లిపోదామా అని చూస్తున్నాడు. ఏ క్షణంలోనైనా కొండ చివరి నుంచి దూకడానికి సిద్ధంగా ఉన్నట్టుగా ఉందా యువకుడి పరిస్థితి.

ఆ చుట్టుపక్కల మేము ముగ్గురం తప్ప మరెవ్వరూ లేరు. వాళ్ళకి పదడుగుల దూరంలో నేనున్నాను. నాకు అంతా స్పష్టంగా కనిపించింది. మొదట్లో ఆ అబ్బాయి చేష్టలు చూస్తూ ఆమెను గమనించలేదు కానీ, ఇప్పుడు మళ్లీ ఆ దృశ్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంటే అన్పిస్తోంది – ఆమె మొహం చూసిన మరుక్షణమే (హఠాత్తుగా ఆమె మరబొమ్మలా ఇటు వైపు తిరిగింది. అప్పుడు చూశానామె కళ్లు) నా మదిలో ఆమె చిత్రం ముద్రించబడింది. అప్పుడే ఆ అబ్బాయి పరిస్థితి నాకర్థమయింది. అక్కడ జరగబోయే సన్నివేశాన్ని చూడడంలో నష్టమేమీ లేదని అప్పుడే నిశ్చయించుకున్నాను (గుసగుసలతో సాగుతున్న వారి సంభాషణ లోని మాటలను వీస్తున్న గాలి దొంగిలించి నా వైపు విసురుతోంది). నాకు చూడడం తెలుసు; నిశితంగా చూడడం ఇంకా బాగా తెలుసు. చూడడమే కాదు, అందులోని కష్టనష్టాలూ తెలుసు. ముక్కుతో వాసన చూసే ప్రక్రియ మన లోపలకి ప్రవహిస్తుంది. కానీ కళ్లతో చూడ్డమనే ప్రక్రియ అలా కాదు – మనల్ని దాటి బయటకెక్కడెక్కడికో ఎగరేసుకుంటూ తీసుకుపోతుంది. ఇంకా చెప్పాలంటే... (ఈ మైఖేల్ గాడో పెద్ద వెధవ. ఇలా సంబంధం లేకుండా వాగుతూనే ఉంటాడు). సరే విషయానికొస్తే... చూడడం, చూసి స్పందించడం అనే రెండు ప్రక్రియల్లో ఉన్న వ్యత్యాసం ముందే తెలిసినట్టయితే రెండింటిలో ఒక్కదాన్నే అవలంబించి నగ్నసత్యాన్ని మాత్రమే గ్రహించగలగొచ్చు. కానీ అది ఏమంత సులభమైన పని కాదనీ ఖచ్చితంగా తెలుసు.

ఆ అబ్బాయి విషయానికొస్తే, అతని రూపంకంటే ముందు అతని చిత్రమే గుర్తుకొస్తోంది (ఈ చిత్రం సంగతి మీకు తర్వాత నివృత్తి అవుతుంది), కానీ ఆమె విషయంలో మాత్రం చిత్రం కంటే ఆమె రూపమే నాకు బాగా గుర్తు. ఆమె బక్కగా, పలచగా ఉంది – ఆమెను వర్ణించడానికి ఈ పదాల వాడుక అన్యాయమే! పొడుగాటి నల్లని ఫర్ కోట్ ధరించి కాస్త పొడవుగానూ, కాస్త అందంగానూ ఉంది. ఆ నాటి ఉదయపు గాలి (ఇప్పుడు గాలి మరీ అంత ఉధృతంగా లేదు; చలి కూడా బాగా తగ్గిపోయింది) ఆమె కురులను రెండింటిగా విడదీసి, పాలిపోయిన, విషాదభరితమైన (మరో రెండు పదాలతో ఆమెకు అన్యాయం జరిగిపోతోంది) ఆమె మొహాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. తన పాదాక్రాంతమైన ఒంటరి ప్రపంచాన్ని ఆమె నల్లటి కంటి చూపులతో సూటిగా చూసింది, ఇంతలోనే తనకేమీ పట్టనట్టు తలతిప్పుకుంది; ఏమిటా కళ్ళల్లో ఘోరమైన ఆ పచ్చని జిగట. నేనిక్కడేదీ వర్ణించటం లేదు. మరింతగా అర్థం చేసుకోడానికి చేసే ప్రయత్నం మాత్రమే ఇది. అలా అంటూనే ఆమె చూపుల్లో పేరుకున్న పచ్చని జిగట అంటూ రోతగా వర్ణిస్తున్నాను.

ఏ మాటకామాట చెప్పుకోవాలి. ఆ యువకుడు మంచి దుస్తులే ధరించి ఉన్నాడు. చేతికి పసుపు రంగు గ్లోవ్స్ వేసుకుని ఉన్నాడు; ఖచ్చితంగా ఆ గ్లోవ్స్, లా లేదా సోషియాలజీ చదువుతున్న వాళ్ల అన్నవి అయివుంటాయి. చాలా సేపటి వరకు నాకు అతని మొహాన్ని చూసే అవకాశం కలుగలేదు. బహుశా ప్రొఫైల్ లో కాస్త కనిపించిందనుకుంటా. మరీ వెర్రివాడిలా ఏమీ లేదు. కానీ మొహంలో అమాయకత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. వయసు పధ్నాలుగో, పదిహేనో ఉండొచ్చు. కరాటే నేర్చుకోవాలనే కోరికలు, తన చెల్లెలి గురించి తప్పుగా మాట్లాడిన వారితో కొట్లాటలు; ఇప్పటికీ అమ్మ వడ్డిస్తే మాత్రమే తినే అలవాటు, అన్నింటికీ నాన్నని డబ్బులడగాల్సిన పరిస్థితి; ఒక కాఫీ తాగాలన్నా, సిగెరెట్ తాగాలన్నా స్నేహితులే దిక్కు. రోడ్ పై నడుస్తూ – తన క్లాస్ లోని అందగత్తెతో కొత్తగా రిలీజైన సినిమాకి వెళ్ళినట్టు, దారిలో పబ్ కెళ్ళి బీర్ తాగినట్టు, బయటకొచ్చి షాపులో తమకి నచ్చినవన్నీ కొన్నట్లు – కలలు. ఇంట్లో (ఆ ఇల్లు చాలా గౌరవప్రదంగానూ, సంప్రదాయంగానూ ఉండి ఉండాలి. ఇంటి గోడల మీద అందమైన ల్యాండ్ స్కేప్ చిత్రాలు; ఇల్లంతా అమరిక గా సర్దబడిన సామాగ్రి) ఒక మూల కూర్చుని పరీక్షలకోసం చదువుకోవడం; అది చూసి తల్లి మురిసిపోవడం; తండ్రిలా తనూ ప్రయోజకుడవ్వాలనే కలలు; మధ్యలో ఖాళీ

సమయంలో వేరే ఊర్లో ఉన్న మేనత్త కి ఉత్తరం రాయడం – ఇలా మెల్లగా సాగుతుంది కాలం. కానీ తిరిగి వీధిలోకి వచ్చాడంటే అతనో కలల రారాజు (జేబులో చిల్లి గవ్వ లేకపోయినా). నగరపు వీధులు, నది ఒడ్డు అతని సొంతం. ముప్పై పైసలుంటే గుప్పెటి నిండా తినుబండారాలు, ప్యాంట్ జేబులో నలిగిపోయిన శృంగార పత్రిక, ఖాళీ జేబుల్లాంటి ఏకాంతం అతని సొంతం.

ఇది ఆ యువకుడి కథ అయ్యుండొచ్చు. ఆ వయసులో ఉన్న ఏ యువకుడికైనా ఈ కథ సరిపోతుంది. కానీ ఇప్పుడు ఇక్కడ చూస్తున్నామే, ఆ యువకుడు ఈ లోకంలో లేడు; తన మాటలతో ఆమె అతన్ని చుట్టుముట్టేసింది. (మళ్లీ మళ్లీ చెప్తున్నానని విసుగుపడకపోతే, ఇప్పుడే మరో రెండు మేఘాలు కదిలి వెళ్తున్నాయి. ఆ రోజు ఉదయం నేను కనీసం ఒక్క సారైనా ఆకాశం వైపు చూసినట్టు గుర్తు లేదు. ఆ యువకుడు–స్త్రీ ల మధ్య జరుగుతున్న సన్నివేశం చూస్తూ తర్వాత ఏం జరుగుతుందో అని వేచి చూస్తూ ఉండిపోయానే తప్ప...) టూకీగా చెప్పుకోవాలంటే, ఆ అబ్బాయి బాగా ఆందోళన చెంది ఉన్నాడు. దాదాపు అరగంత క్రితం అక్కడ ఏం జరిగి ఉంటుందో ఊహించడం మరీ అంత కష్టమేమీకాదు. అలా నది ఒడ్డున నడుస్తూ అతను కాసేపటి క్రితమే ఇక్కడికి చేరుకున్నాడు; ఆమెని చూశాడు. చాలా బావుందే అనుకున్నాడు. ఆమె కూడా ఇలాంటి వారి కోసమే ఎదురుచూస్తోంది. బహుశా ఇలా జరగుండకపోవచ్చు? ఆ అబ్బాయే అక్కడికి ముందు చేరుకునుండొచ్చు. దూరంగా ఉన్న భవంతిలోనుంచి ఆమె అతన్ని చూసింది. భవంతా? కాదు. కారులో వెళ్తూ ఒంటరిగా కూర్చున్న అతన్ని చూసి అతని దగ్గరకు వచ్చింది; మాటలు కలిపింది. అతను భయపడతాడనీ, భయంతో అక్కడ్నుంచి పారిపోవాలనుకుంటాడనీ తెలుసు. కానీ పెద్ద అనుభవం ఉన్న వాడిలా ఫోజు కొడ్తూ భయం భయంగానే అక్కడ ఉండే సాహసం చేస్తాడని కూడా ఆమెకు తెలుసు. ఆ తర్వాతేం జరిగిందో ఊహించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వారికి పది అడుగుల దూరంలో కూర్చుని జరిగిందంతా చూస్తున్న ప్రత్యక్ష సాక్షి ని నేనున్నానుగా? వారాడుతున్న ఆటలో ఒక్కొక్క దశ అంచనా వేయడం పెద్ద కష్టం కాదు కానీ, ఆ యువకుడి క్లిష్ట స్థితిని స్పష్టముగా ఆవిష్కరించే పతాక సన్నివేశం ఎలా ఉంటుందో అని నాకు ప్రత్యేకమైన ఆసక్తి. బహుశా, వేరే పనుందనో, ఎక్కడో తన గర్ల్ ఫ్రెండ్ ఎదురుచూస్తుందనో చెప్పి అతను అక్కడ్నుంచి తప్పించుకోజూస్తాడు. అంది వచ్చిన అవకాశాన్ని పిరికి వాడిలా వదిలి వెళ్తున్న అతన్ని ఆమె చూపులతో కాల్చేస్తుండగా అతను సిగ్గుతో తలవంచుకొని ఆమె కి దూరంగా వెళ్ళిపోతాడా? ఏమో

అతను అంత పని చెయ్యడేమో? ఆమె ఆకర్షణలో పడి ఏం చెయ్యాలో తోచని పరిస్థితిలో అతనుండగా, ఆమే చొరవ తీసుకుని అతని మొహాన్ని ప్రేమగా స్పృశించి, అతని తలలోకి తన వేళ్లు పోనించి, శృంగారం పొలకబోస్తూ కాసేపటికి అతని చెయ్యి పట్టుకుని అక్కడ్నుంచి తీసుకెళ్తుండగా, అతను తటపటాయిస్తూ, జరగబోయే సాహసంలో తన భాగాన్ని ఊహించుకుంటూ ఉత్తేజితుడై ఆమె నడుం మీద చెయ్యేసి ఆమెను ముద్దాడవచ్చు. ఇలా ఏదైనా జరగొచ్చు. కానీ అలాంటిదేమీ జరగలేదు. నది ఒడ్డున పార్క్ లో కూర్చుని మాట్లాడుకుంటున్న ఆ అసాధారణమైన జంట మధ్య తనూహించినట్టు ఏమైనా జరుగుతుందేమోనని ఆబగా వాళ్లవైపే చూస్తూ తన చేతిలో కెమెరాని సిద్ధం చేసుకున్నాడు మైఖేల్.

నిజానికి అక్కడ నేననుకున్నంత సన్నివేశం ఏమీ లేదేమో? అసలక్కడేముంది (వయసులో తేడా ఉన్న ఒక జంట. అది తప్ప మరేమీ లేదక్కడ). ఇదంతా నేను సృష్టించిన అభూత కల్పనా? ఒక వేళ ఇప్పుడు నేను ఫోటో తీస్తే అందులో నా ఆలోచనల్లోని మూర్ఖత్వం కూడా తాండవిస్తుందేమో! బహుశా నాకే ఇలా అనిపిస్తుందా? ఈ విషయమే అక్కడ కారులో టోపీ పెట్టుకున్న వ్యక్తిని అడగాలనిపించింది. అతను కార్లో కూర్చుని పేపర్ చదువుతున్నాడో లేక నిద్రపోతున్నాడో నాకు అర్థం కాలేదు. నేను అతన్నిఅప్పటివరకూ గమనించలేదు. ఆగిన కారుల్లో కూర్చున్న మనుషులకు మాయమైపోయే ఒక గుణం ఉంటుంది; చలనం లో ఉన్న కారులో ఒక అందం ఉంటుంది; కానీ ఆగిన కారు దౌర్భాగ్యమైన ప్రైవేట్ బోను తో సమానం. ఆ కారు చాలా సేపట్నుంచి అక్కడే ఉంది. ఉందంటే ఉంది: పార్క్ లో బెంచి లా, పక్కనే ఉన్న కరెంట్ స్తంభంలా. అంతే కానీ, గాలిలా, సూర్యకాంతిలా అదక్కడ ఉందని చెప్పలేము. ఈ గాలి, ఈ వెలుగు, ఆమె, ఆ యువకుడు – ఇవన్నీ ఆ స్థలానికో మార్పు చేకూరుస్తాయి; పరిసరాలను సరికొత్తగా ఆవిష్కరిస్తాయి. విషయానికొస్తే, ఆ కారులో న్యూస్ పేపర్ వెనక దాగి ఉన్న అతను, నాలాగే, ఏదో జరగబోతోందని ఎదురుచూస్తున్నాడేమో! ఇప్పుడే వాళ్లిద్దరూ అక్కడ్నుంచి లేచారు. ఆమె అతన్ని మెల్లగా ఒక గోడ దగ్గరకు తీసుకెళ్లింది. అతను ఆమెకన్నా ఎత్తుగానే ఉన్నాడు కానీ అతని పై ఆధిపత్యం మాత్రం ఆమెదే (ఆమె నవ్వు పక్షుల రెక్కలు విదిలింపు చప్పుడులా ఉంది). నవ్వుతూ, గాలిలో ఒక చేతిని ఊపుతూ చూపులతోనే అతన్ని కాల్చివేస్తోంది. ఇంకా ఆలస్యం ఎందుకు? ఎపెర్చర్ పదహారులో

సెట్ చేశాను; ఆ దరిద్రపుగొట్టు కారుని ఫ్రేం లోకి రానివ్వకుండా, వాళ్లిద్దరు మాత్రమే వచ్చేలా చూసుకుని, మరీ వెలితిగా అనిపించకుండా పక్కనే ఉన్న చెట్టుని కూడా ఫ్రేంలో ఇమిడ్చాను.

ఒక మంచి ఫోటోగ్రాఫ్ లక్షణం ఏంటంటే లయబద్ధంగా సాగే జీవితానికీ మరియు నిరంతరంగా సాగే కాలప్రవాహానికీ అది ఖండన బిందువు అయ్యుండాలి. ఆ బిందువు ని సరిగ్గా గుర్తించకుంటే కాలానికీ, జీవితానికీ ద్రోహం చేసినట్టే! అందుకే కెమెరా పైకెత్తి ఫోకస్ సరి చూసుకుంటూ, జరగబోయే సన్నివేశంలోని పతాక దృశ్యాన్ని కెమెరాలో బంధించాలనే తపనతో ఓపిక గా ఎదురు చూస్తూ కూర్చున్నాను. నేను మరీ ఎక్కువ సేపు ఎదురు చూడాల్సిన అవసరం రాలేదు. ఆమె అతని చేతులను సుతిమెత్తగా స్పృశిస్తూ సంకెళ్ళు వేసింది; అతనిలో ఏ మూలో దాగి ఉన్న స్వేచ్ఛాభావన్ని సైతం ఆమె లాగేసుకుంటోంది. అతన్ని చేతిలో చెయ్యేసి నడిపించుకుంటూ (ఆకాశంలో ఒంటరిగా తేలుతోంది మేఘమొకటి) తన ఇంటికి తీసుకెళ్తోంది (ఆ ఇంటినిండా పిల్లులు, రంగు రంగుల పిల్లులు). ఇదంతా తనకేమీ కొత్త కాదన్నట్టుగా నటించే ప్రయత్నంలో మరింత ఇబ్బంది పడిపోతున్నాడా అబ్బాయి. కళ్లు మూసుకుంటే నాకంతా ఒక సీన్ లా కనిపిస్తోంది. ముద్దులతో సరసాలు, ఆమె జాకెట్ బటన్స్ అతను విప్పడానికి ప్రయత్నిస్తుంటే వద్దు వద్దంటూనే కావాలనే ఆమె చూపులు – అచ్చం నవలల్లోలాగే! కౌగిలి వెచ్చదనం, రాజుకుంటున్న శరీరాలు, వేడి నిట్టూర్పులు – చివరికి అంతా నవలలోలాగే జరిగుండవచ్చు; జరగకపోయుండొచ్చు. అసలు ఆమె ఆ అబ్బాయిని ప్రియునిగా కోరుకోవటమే లేదేమో! కేవలం తన్ను తాను ఉత్తేజపరుచుకోవాడానికో లేదా మరెవరిలోనో ఈర్ష్య రేకెత్తించడానికో అతన్ని పావుగా వాడుకుంటుందేమో? ఏమో!

మైఖేల్ తో ఇదే సమస్య; కథలల్లడం, కల్పిత అవాస్తవాలు సృష్టించడంలో మునిగిపోతాడు. నియమాలను అతిక్రమించే వాళ్లనూ, సమాజానికి వ్యతిరేకంగా బతికేవాళ్లను తన ఊహల్లో సృష్టిస్తుంటాడు. పార్క్ లో ఆమెను చూడగానే మైఖేల్ ఊహాలకు అంతులేకుండా పోయింది. నాలో కొన్ని రోజులకు సరిపడా ఊహలకు బీజం వేసింది ఆమె. అసలే నాకు జ్ఞాపకాలను ఊహలతో కలిపి నెమరువేసుకునే అలవాటు ఉంది. వాళ్లు పార్కులోంచి వెళ్లిపోవడానికి సిద్ధమైనట్టు అనిపించింది. ఇక ఆలస్యం చెయ్యదలుచుకోలేదు. నేననుకున్న ఫ్రేం సెట్ చేసి (వాళ్లిద్దరూ ప్లస్ చెట్టు మైనస్ కారు) కెమెరా క్లిక్ చేశాను. తలెత్తి చూసేసరికి వాళ్లిద్దరూ నన్నే చూస్తున్నారు. నేను

ఫోటో తీసిన విషయం వాళ్లకి తెలిసిపోయింది. ఆ యువకుడి మొహంలో ప్రశ్నార్థకంతో కూడిన ఆశ్చర్యం; ఆమె మాత్రం అణువణువునా నా మీద ఉక్రోషంతో ఊగిపోయింది; తన అస్తిత్వాన్ని దొంగలించి చిన్న యంత్రంలో బంధించాననే అవమానంతో రగిలిపోయింది.

నేను చేసిన పనికి వాళ్ళిద్దరూ ఎలా బాధపడ్డారో చాలా వివరంగా వర్ణించవచ్చు. కానీ అదొట్టి వృధా ప్రయాస. ఆమె కోపంగా నా వద్దకు వచ్చి పదానికో సారి మొహంలో రంగు మార్చుతూ, అనుమతి లేకుండా ఫోటోలు తీసే హక్కు ఎవరికీ లేదని, కెమెరా లోని ఫిల్మ్ రోల్ ని తనకివ్వమనీ అడిగింది. నాకైతే ఆ ఫిల్మ్ రీల్ ఆమెకివ్వాలా వద్దా అన్న ఆలోచనే లేదు. నాగురించి తెలిసిన వాళ్ళని ఎవరినడిగినా చెప్తారు – నా వద్దనుంచి మీకేమైనా కావాలా, మర్యాదగా అడగండి. ఆమె అడిగిన విధానం చూసి నేను రీల్ ఇవ్వదలుచుకోలేదు. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాల్లో ఫోటోలు తీయడంలో ఎటువంటి నిషేధాజ్ఞలు లేకపోవటమే కాదు ఇలా ఫోటోలు తీయడానికి సహకరించడం తో పాటు చాలామంది అభినందిస్తారని ఆమెకు వివరించాను. నేనిదంతా అమెకు చెప్తుండగా, ఆ యువకుడు ఉన్నచోట ఉంటున్నట్టే వెనక్కి వెనక్కి మళ్లుతున్నాడు (ఇదంతా నాకు భలే గమ్మత్తుగా తోచింది), పాపం కుర్రాడు, అప్పటి వరకూ స్వర్గపుటంచులదాకా ప్రయాణించి, క్షణంలో అంతా మాయమైపోగా ఒక్క ఉదుటున వెనక్కి తిరిగి తాను నడుస్తున్నాడని తనకు తాను అనుకుంటున్నాడేమో కానీ నిజానికి వేగంగా పరిగెత్తుతూ, అక్కడ ఆగి ఉన్న కారుని దాటుకుంటూ మాయమైపోయాడు.

కానీ స్వర్గపుటంచుల్లోనే నరకం కూడా ఉందంటారు. ఇతరుల జీవితాల్లో జోక్యం చేసుకునే వెధవనీ, బుద్ధిహీనుడనీ ఆమె తిడ్తుంటే, మైఖేల్ మాత్రం మొహంమీద నవ్వు పులుముకుని ఆమె చెప్తున్నది ఆసక్తిగా వింటున్నట్టు తలూపుతూ నటించేశాడు. ఆపకుండా కొనసాగిస్తున్న ఆమె మాటలకు కాసేపటికి నాకు విసుగొచ్చేస్తుండగా, కారు డోర్ వేసిన శబ్దం రావడంతో అటు వైపు చూశాను. టోపీ పెట్టుకున్న ఆ వ్యక్తి కారులోంచి దిగి మా వైపే చూస్తున్నాడు. అప్పుడు కానీ నాకర్థం కాలేదు ఈ నాటకంలో ఆయనా ఒక పాత్రధారే అని.

అప్పటివరకూ చదువుతున్నట్టు నటిస్తున్న న్యూస్ పేపర్ ని చేతిలో పట్టుకుని అతను మా వైపే రాసాగాడు. నాకతని గురించి బాగా గుర్తున్న విషయం ఏంటంటే ఆ చివరి నుంచి ఈ చివరి వరకూ వంకర్లు తిరిగిన అతని మూతి; వణుకుతున్న అతని పెదాలు, కోపం తో నిండిపోయిన

అతని మొహం మీది ముడతలు. మొహం తప్పితే మిగతా శరీరమంతా స్థిరంగా ఉంది. పాలిపోయిన మొహంతో చూడ్డానికి కాస్త సర్కస్ లో జోకర్ లా ఉన్నాడతను. లోతైన కళ్లు, ఎండిపోయిన చర్మం, మొహానికి మొత్తానికి కొట్టొచ్చినట్టు కనిపించే నల్లటి ముక్కు రంధ్రాలేమో అతని కనురెప్పలు, వెంట్రుకలకంటే నల్లగా ఉన్నాయి. అడుగులో అడుగు వేస్తూ అతని నడిచిరావడం చూస్తే, అతని ఖరీదైన బూట్ల కింద నలిగిన రాళ్ళు అతని పాదాలకు గుచ్చుకుని బాధిస్తున్నాయేమో అనిపించింది. అతన్ని చూడగానే నేను ఎందుకు మెట్లమీదనుంచి దిగానో, ఎందుకు వాళ్లకి ఫోటో రీల్ ఇవ్వనని నిర్ణయించుకున్నానో నాకే తెలియదు. రీల్ ఇవ్వమని అధికారంగా అడిగినప్పటికీ వారి మొహంలోని పిరికితనం నాకు తెలిసిపోవడం వల్ల కావచ్చు. టోపీ పెట్టుకున్న ఆ జోకర్ గాడు, ఆమె మౌనంగా సంప్రదించుకున్నారు: మేమ్ముగ్గురం  కాసేపు ఒక పరిపూర్ణమైన త్రికోణం రచిస్తూ నిలబడ్డాము. కానీ కొద్ది సేపట్లోనే నేను దాన్ని అపరిపూర్ణం చేసి, వారి మొహాలను చూసి నవ్వుకుంటూ అక్కడ్నుంచి కొంచెం వేగంగానే నడుచుకుంటూ వెళ్లిపోయాను. కాస్త ముందుకు నడిచి బ్రిడ్జి దాటుతుండగా వెనక్కి తిరిగి వాళ్ళ వైపు చూశాను. వారిద్దరూ అక్కడ్నుంచి అడుగైనా ముందుకెయ్యలేదు. కానీ ఆ వ్యక్తి మాత్రం చేతిలో ఉన్న న్యూస్ పేపర్ ని కింద పడేశాడు. ఆమె గోడకానుకుని ఇబ్బందిగా రాళ్ళను తడుముతోంది.

ఆ తర్వాత అక్కడ ఏం జరిగిందో, అది దాదాపు ఇప్పుడే, ఐదో అంతస్థులోని ఈ చిన్న గదిలో జరిగింది. పార్క్ లో ఫోటోలు తీసిన కొన్ని రోజుల తర్వాత మైఖేల్ వాటిని డెవలప్ చేశాడు. నగరం మధ్యలోని చర్చ్, మ్యూజియం భవంతి ఫోటోలు బాగానే వచ్చాయి. ఒక ఇంటి పైకప్పుపై ప్రమాదకరంగా సంచరిస్తున్న ఒక పిల్లి ఫోటో అంత బాగా రాలేదు. చివరిగా తను పార్క్ లో తీసిన వారిద్దరి ఫోటో డెవలప్ చేశాడు. ఆ ఫోటో ఎంత బాగా వచ్చిందంటే వెంటనే దాన్ని బ్లోఅప్ చేసి పెద్దదిగా ప్రింట్ చేశాడు. ఆ ప్రింత్ ఎంత బావొచ్చిందంటే, వెంటనే మరింత పెద్దది చేసి పోస్టర్ సైజ్ లో ప్రింట్ చేశాడు. నిజానికి అంతపని అవసరమైంది మ్యూజియం ఫొటోలకే అని అతనికి అప్పుడు అనిపించలేదు. తను తీసిన ఫోటోలన్నింటికంటే పార్క్ లో తీసిన ఫోటోనే అతనికి ఆసక్తికరంగా అనిపించింది. ఆ ఫోటోని వెడల్పాటి తన గది గోడకు అంటించాడు. మొదటి రోజు చాలా సేపు ఆ ఫొటో వైపే చూస్తూ, జరిగిన వాస్తవాన్ని దాని తాలూకు తన జ్ఞాపకాలతో పోల్చుకుంటూ, గడిపాడు. ఫొటోలన్నింటిలాగే ఈ ఫొటో ఒక ఘనీభవించిన జ్ఞాపకం, అది దేన్నీ

మినహాయించక, శూన్యాన్ని కూడా మినహాయించక, సన్నివేశాన్ని గడ్డకట్టించి పట్టుకుంది. ఆ ఫోటోలో ఆమె ఉంది, ఆ అబ్బాయి ఉన్నాడు, నిటారుగా నిల్చున్న చెట్టు ఉంది, మెరిసిపోతున్న ఆకాశం ఉంది, మేఘాలున్నాయి, గోడకు పేర్చిన రాళ్ళున్నాయి. వీటన్నింటినీ ఇముడ్చుకుని ఒక అవిభాజ్యమైన పదార్థంలా పోత పోసుకుని ఉందా ఫోటో (ఇప్పుడే మరో మేఘం దూసుకెళ్తోంది). మొదటి రెండు రోజులు ఆ ఫోటో ని ఎందుకు పెద్దది చేసి పోస్టర్ లా అంటించానా అనే ప్రశ్న నాకు తట్టలేదు. నా అనువాదపు పనుల్లో మునిగిపోయి టైప్‌రైటర్ వద్ద కూర్చుని అప్పుడప్పుడూ తలెత్తి చూసినప్పుడల్లా ఫోటోలోని ఆమె ముఖమో, మెట్లపై పేరుకున్న దుమ్మో కనిపించేవి. నేనో పెద్ద వెధవని; ఏదైనా ఫోటోని మనం దాని ఎదురుగా నిల్చుని చూసినప్పుడు, మన కళ్లకు కనిపించేది కెమెరా లెన్స్ ఏ కోణంలోంచి ఆ దృశ్యాన్ని చిత్రీకరించిందో ఆ కోణం మాత్రమేనని అప్పటివరకూ స్ఫురించలేదు. అయినా ఇలాంటి సాధారణ విషయాలు మనకు తెలియకుండానే తెలుసనే అంగీకార భావనలో మనం బతికేస్తాం. గోడకంటించిన పోస్టర్ కి పదడుగుల దూరంలో టైప్‌రైటర్ ముందు కూర్చుని తలెత్తి చూసినప్పుడల్లా నాకు పార్క్ లో దృశ్యం సజీవంగా సాక్షాత్కరించేది. నిజమే ఆ ఫోటోని ఎదురుగా నిల్చుని కాకుండా మరో కోణంలో చూస్తే సరికొత్త విషయాలు ఆవిష్కృతమవుతాయేమో. కానీ నాకైతే ఇక్కడ్నుంచి ఆ ఫోటో చూడడం బాగా నచ్చింది. అప్పుడప్పుడూ నేను అనువాదం చేస్తూండగా సరైన పదం దొరకనప్పుడల్లా తలెత్తి ఆ ఫోటో వైపు చూసే వాడిని. ఒక్కోసారి ఆమె నా కంటికి చిక్కేది. మరోసారి ఆ అబ్బాయి కనిపించేవాడు. ఇంకోసారి మెట్లపై రాలిపడి ఫోటో కింది భాగానికి అందం తెచ్చిన ఎండుటాకు నా దృష్టిని ఆకర్షించేది. ఆ తర్వాత రోజు ఉదయం నా అనువాదపు పనులను పక్కనపెట్టి ఆ చిత్రాన్ని పరిశీలించడంలో మునిగిపోయాను. తన ఫోటో తనకిచ్చేయాలని ఆమె దబాయింపు, వెనక్కి తిరిగైనా చూడకుండా పరిగెత్తిన ఆ యువకుడి మొహంలోని భయం, కారు దిగి వస్తున్న ఆ వ్యక్తి మొహంలోని కోపం... ఆ రోజు జరిగిన సంఘటన లోని దృశ్యాలు ఒక్కొక్కటిగా గుర్తుకొచ్చాయి. నిజం చెప్పాలంటే ఆ ఫోటో చూసినప్పుడల్లా, నేను చేసింది పెద్ద ఘనకార్యం కానప్పటికీ నాలో తెలియని ఒక సంతృప్తి. అయినా కూడా ఆ రోజు వాళ్లతో ఫోటోగ్రాఫర్ల హక్కుల గురించి, ప్రజల స్వాతంత్ర్యం గురించీ ఏ మాత్రం వాదించకుండానే ఎందుకొచ్చేశానా అనే ఒక అసంతృప్తి కూడా ఉంది. కానీ ఇవన్నీ వదిలేస్తే, ముఖ్యమైన, అతి ముఖ్యమైన విషయం ఏంటంటే, ఆ కుర్రాడికి

తప్పించుకునే అవకాశం కల్పించటంలో నేను చేసిన సాయం (...అంటే అతను తప్పించుకోవటం అతని మంచికే అనే నా ఊహ నిజమయ్యుంటే! అయ్యే ఉండాలి. అతను పారిపోవటమే దానికి ఒక ఋజువు). ఫోటో తీయడమనే ఒక చర్య ద్వారా నేను ఆ కుర్రాడు పారిపోవడానికి అవకాశం కల్పించాను. అయితే తన మగతనపు విలువ తగ్గి అగౌరవం పాలైనందుకు బహుశా అతను ఇప్పుడు బాధపడుతూ ఉండివుండొచ్చు. కానీ ఆ రోజు పార్క్ లో తన వంక అలాంటి చూపు చూడగలిగిన ఆడదాని మాయలో పడి కాలిపోవడం కంటే  అదే మంచిది కదా! ఇలాంటి విషయాల్లో మైఖేల్ దాదాపు ఛాందసమనిపించేంత కఠోరమైన నైతిక వాది. ఎవరన్నా ఎవర్నయినా కేవలం ఆధిక్యత చూపించుకోవటం కోసమే లొంగదీసుకోవటం అతనికి నచ్చదు. మొత్తానికి ఆఖరుగా తేలిందేమిటంటే, పార్క్ లో ఆ ఫోటో తీయడమనేది మంచి పనే!

కానీ నేను నా పని మధ్యలో తలెత్తి దాన్ని అన్నిసార్లు చూసింది కేవలం అది మంచి పని అన్న కారణంతో మాత్రమే కాదు. అసలు నేను ఆ ఫోటోని పెద్దదిగా ఎందుకు ప్రింట్ చేశానో, వాల్ పోస్టర్ లా ఎందుకు అంటించానో తెలియదు; బహుశా ప్రమాదకరమైన విషయాలు ఇలా ఆలోచనారహితంగా చేస్తే తప్ప అవి నెరవేరవేమో! మొదట్లో ఆ చిత్రం లోని చెట్టు మీద నుంచి రాలుతున్న ఎండుటాకుల చప్పుడు విని నేను పెద్దగా కలవరపడలేదు. ఆ సమయంలో నేనో వాక్యాన్ని విజయవంతంగా అనువదించి మరో వాక్యం వైపు మరలే ప్రయత్నంలో ఉన్నాను. అప్పటికే ఆ ఫోటో చూడడమనే అలవాటు కాస్తా వ్యసనంగా మారిపోయింది. 32 X 28 సైజులో ముద్రించిన ఆ పోస్టర్ చివరికి సినిమా తెరలా కనిపించడం మొదలయింది. పార్క్ మధ్యలో నిల్చుని, వయసులో తన కంటే చిన్నవాడైన ఒక యువకుడితో ఒక యువతి మాట్లాడుతోండగా, పక్కనే ఉన్న చెట్టునుంచి ఎండుటాకులు రాలి నేల మీద పడుతున్నాయి.

కానీ ఆమె చేతులు ఆడించే విధానమే నాకు చిత్రంగా అనిపించింది. అంతకుముందే, “దీన్ని బట్టి, సమాజంలో స్వతస్సిద్ధంగా ఉండే సంక్లిష్టతల్లో భాగంగానే...” అని ఒక వాక్యాన్ని అనువాదం చేస్తుండగా తలెత్తి చూసేసరికి ఆమె నా దృష్టి ని మరోసారి ఆకర్షించింది. ఆమె చేయి, చేతి ఒక్కొక్క వేలూ, సుతారంగా కదులసాగాయి. అంతే నాలో ఏదో అలజడి. ఇక నాకు ఏం మిగల్లేదు. అనువదిస్తున్న ఏ వాక్యంతోనూ ఇక నాకు పనిలేదు. నేలపాలైన టైప్‌రైటర్; కిర్రుమంటూ ఊగుతోన్న కుర్చీ; నన్ను చుట్టుముట్టేసిన పొగమంచు.  బోక్సింగ్ ఆటలో ఓడిపోయే చివరిక్షణంలో

ఎదుటివాడి గుద్దులు తప్పించుకోజూసినట్టు, ఆ అబ్బాయి తల కిందకి వంచుతున్నాడు. తన కోటు కాలర్ ని పైకి లేపి జరగబోయే విపత్తుకి సిద్ధమైన బలిపశువులా ఆమె చూపులకు బందీ అయ్యాడు. ఇప్పుడు ఆమె రహస్యంగా అతని చెవిలో ఏదో చెప్తోంది. విచ్చుకున్న ఆమె చేయి మెల్లగా అతని మెడమీదకు పోనిచ్చి మృదువుగా రాస్తోంది; రాస్తూ, రాస్తూ మంటరాజేస్తోంది. అతని కళ్లల్లో ఇప్పుడు భయం కంటే అనుమానమే ఎక్కువగా గోచరిస్తోంది. అప్పుడప్పుడూ అతను తలెత్తి ఆమె మెడ మీదుగా ఏదో చూస్తున్నాడు. ఆమె అతనితో చెవిలో ఏదో రహస్యంగా చెప్తూనే ఉంది. అతను రెండు నిమిషాలకోసారి టోపీ వాడు కూరున్న ఉన్న కారు వైపే చూస్తున్నాడు (ఈ విషయంలో ఎటువంటి అనుమానం లేదు). ఆ కారు ఫోటోలో కనిపించకపోయినా అతని చూపుల్లో, ఆమె మాటల్లో, ఆమె చేతుల కదలికల్లో తెలిసిపోతోంది. కారు దిగి, జేబుల్లో చేతులు పెట్టుకుని – ఆదేశం, ఆవేశం సమపాలల్లో పూరించిన కళ్లతో వారిని సమీపించిన ఆ టోపీ వ్యక్తి వారిని చూసిన చూపుల్లో – ఆ క్షణంలో ఏం జరిగుండాలో, ఏం జరిగుండేదో, ఇప్పుడేం జరుగుతుందో – నాకర్థమయింది; అసలిదంతా అర్థమవ్వాల్సిన అవసరం ఏదైనా ఉంటే అది నాకు బాగానే అర్థమయింది. ఆ క్షణంలో వారి మధ్య జరగాల్సింది జరగకుండా అమాయకంగా అడ్డుపుల్ల వేశాను. కానీ అప్పుడు జరగాల్సింది ఇప్పుడు నా కళ్ళముందు జరగబోతోంది. అంతకుముందు నేను పార్క్ లో ఊహించినదానికంటే కళ్లముందు జరుగుతున్న వాస్తవమే మరింత దారుణంగా ఉంది. ఆమె ఆ కుర్రాడి తో సరసమాడుతూ తన కోరికలను తృప్తి పరుచుకోడానికో, లేక ఇంతలోనే భయపడ్తూ అంతలోనే ఆశపడ్తూన్న ఆ యువకుడి భావావేశాలు చూసి ఆనందం చెందడానికో అక్కడికి రాలేదు. ఆమె అక్కడికి పంపబడింది. ఆ పంపించిన వాడు కారులో కూర్చుని అంతా తననుకున్నట్టే జరుగుతోందని క్రూరమైన చిరునవ్వు చిందిస్తున్నాడు. యువకులకు పువ్వులతో అలంకరింపబడ్డ సంకెళ్లు వేసి తనకోసం బంధీలుగా వాళ్లను పట్టుకురావటానికి స్త్రీలను ఎరగా పంపేవాళ్లలో అతనేం మొదటివాడు కాదు. ఆ తర్వాత జరిగే దానిగురించి పెద్దగా చెప్పుకోడానికేమీ లేదు. కారు, ఇల్లు, మధువు, ఉద్రేకం, ఉత్తేజం, కన్నీళ్లు, చివరకు నరకంలోకి మేల్కోవటం. కానీ ఈ సారి నేనేమీ చెయ్యలేను, నిజంగానే అసలేమీ చెయ్యలేను. అప్పటివరకూ ఆ ఫోటోనే నా బలమనుకున్నాను. కానీ ఇప్పుడు అదే ఫోటోలో ప్రాణం పోసుకున్న వాళ్ళు నా మీద కక్ష సాధిస్తున్నారు. జరగబోయే కార్యాన్ని నేనాపలేనని వెక్కిరిస్తున్నారు. ఎప్పుడో తీయబడిన ఈ ఫోటో

లోని కాలం ఇక తిరిగిరాదు; గడిచిపోయిన ఆ కాలం నన్ను వారి నుంచి చాలా దూరానికి తోసేసింది. జరగాల్సిన ఘోరం జరిగిపోయి ఉంటుంది; కన్నీళ్లు కార్చడమూ అయ్యుంటుంది. ఇక మిగిలింది తీరని బాధ మాత్రమే. ఒక్కసారిగా మొత్తం తలకిందులైంది. ఫోటో లోని వ్యక్తులు జీవం పోసుకున్నారు; కదులుతున్నారు, తమ భవిష్యత్తుని నిర్ణయించేసుకుంటున్నారు; ఇక్కడ ఐదో అంతస్థులోని ఒక గదిలో నిల్చున్న నేను, కాలమనే పంజరంలో చిక్కుకుని, ఫొటోలోని ఆ అబ్బాయి, ఆమె, టోపీ పెట్టుకున్న ఆ వ్యక్తి ఎవరో తెలియక, అర్థం కాక కెమెరా కి జోడించిన లెన్స్ లా దారుణంగా బిగుసుకుపోయాను. వెక్కిరింతగా చూస్తున్న ఆమె చూపులు, వారి ఇష్టానుసారం చేసుకుంటున్న నిర్ణయాలు, ఆ జోకర్ గాడి వైపే చూస్తున్న ఆ అబ్బాయి చూపులు. ఈ సారి ఆ అబ్బాయి ఆమె చేసిన ప్రతిపాదనకు సరే అంటూ తలూపేస్తాడు. బహుశా అతనికి డబ్బాశ చూపించి ఉండొచ్చు లేదా ఇంకేదో మంత్రం వేసి ఉండొచ్చు. కానీ ఈ సారి నేనేమీ చెయ్యలేను. ఆమె మాటలు నమ్మొద్దనీ, వారి ప్రతిపాదనకు ఒప్పుకోవద్దనీ గట్టిగా అరిచి చెప్పలేను; లేదా వారిదే మరో కొత్త ఫోటో తీసి అతన్నీ నరకం నుండి తప్పించనూ లేను. ఈ సారి నా ప్రమేయం లేకుండానే జరగాల్సిందేదో జరిగితీరుతుంది. ఆ క్షణంలో అంతటా నిశబ్దం ఆవహించింది. అది మామూలు నిశబ్దం కాదు; అంతటినీ తనలో ముంచేసుకునే నిశబ్దం. బహుశా అప్పుడే నేను అరవడం మొదలుపెట్టాను. వెర్రిగా, పిచ్చిగా అరిచాను. అంతే ఆ క్షణంలో నేనూ అక్కడికి చేరుకున్నాను – వారికి నాలుగడుగుల దూరంలో. ఒక అడుగు. మరో అడుగు. చెట్టు మీదనుంచి ఎండుటాకులు లయబద్ధంగా రాలుతున్నాయి. మెట్ల మీద పేరుకున్న దుమ్ము కనిపించింది. అంతలో ఆమె నా వైపు చూసింది. ఆమె మొహంలో ఆశ్చర్యం క్షణక్షణానికీ రెట్టింపవుతోంది. నేను కొద్దిగా పక్కకి చూశాను – నేనంటే నేను కాదు. కెమెరా కొంచెం పక్కకి తిప్పాను. ఆమె వైపు దృష్టి సారిస్తూనే ఆ టోపీ వాడి వైపు కదిలాను. అతనికి కళ్లుండాల్సిన చోట ఇప్పుడు రెండు నల్లటి రంధ్రాలు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ ఆ కళ్ళల్లో ఆశ్చర్యంతో కూడిన ఆవేశమే వ్యక్తమవుతోంది. నా మీద దూకి నన్ను నేలమట్టం చెయ్యాలన్న కాంక్ష అతని కదలికల్లో తెలుస్తోంది. ఆ క్షణంలో దూరంగా ఎక్కడ్నుంచో ఎగురుకుంటూ వచ్చిన పెద్ద పక్షొకటి గోడ మీద ఉన్న ఫోటో ముందుగా ఎగురుకుంటూ వెళ్లింది. ఏం జరిగిందో ఏమో, ఆ కుర్రాడు వెనక్కి తిరిగి చూడకుండా పరిగెడ్తూ కారు ని దాటుకుని వెళ్లి మాయమైపోయాడు. హమ్మయ్య అనుకుంటూ నేను గోడకు చేరగిలబడ్డాను; రెండోసారి ఆ

అబ్బాయిని వారి నుంచి కాపాడగలిగాను. తేలికైన అతని లేత స్వర్గంలోకి అతణ్ణి తిరిగి పంపేశాను. గాఢంగా నిట్టూరుస్తూ వారి ముందు నిల్చున్నాను; వారికి దగ్గరగా అడుగులు వెయ్యాల్సిన అవసరం ఇక లేదు. ఆట అయిపోయింది. ఆమె అసలు ఇప్పుడు ఫ్రేం లోనే లేకుండా నిర్దాక్షిణ్యంగా తోసివేయబడింది. ఆమె భుజం మాత్రం కొద్దిగా కనిపిస్తోంది. అతను మాత్రం ఫ్రేం మధ్యలో నిలబడి ఉన్నాడు; సగం తెరవబడిన అతని నోటిలోనుంచి పొడవాటి నల్లని నాలుక వేలాడుతోంది. అతను తన చేతులను మెల్లగా పైకెత్తి ముందుకు చాచి తనవైపే వస్తున్నాడు. మరుక్షణంలోనే అతనో నల్లని ముద్దగా మారి ఫ్రేం మొత్తాన్ని ఆక్రమించాడు. ఇప్పుడక్కడ పార్క్ లేదు, చెట్టు లేదు. కేవలం నల్లటి నలుపు. ఆ పై చూడడం నావల్ల కాలేదు. గట్టిగా కళ్లు మూసుకుని, మొహాన్ని చేతులతో కప్పుకుని ఓ వెధవాయిలా ఏడుస్తూ కూర్చున్నాను.

ఎన్ని రోజులు గడిచిపోయాయో లెక్క తెలియదు. రోజులాగే ఈ సమయానికి వచ్చే తెల్లటి మేఘమొకటి మెల్లగా కదిలి వెళ్తోంది. ఇక చెప్పుకోడానికి ఏం మిగల్లేదు; మిగిలిందల్లా మేఘాలు, నేను. ఒక్కోసారి ఒంటరి మేఘం; ఇంకోసారి జంట మేఘాలు తరలిపోతుంటాయి. ఎప్పుడో ఏడుపు ఆగాక కళ్లు తుడుచుకుని చూసినప్పుడు, గోడకంటించిన దీర్ఘచతురస్రాకారంలో ఒదిగిపోయిన స్వచ్ఛమైన ఆకాశం కనిపిస్తుంది. ఇంతలో ఎడమవైపు నుంచి కుడి వైపుకి గర్వంగా తేలియాడుతూ మేఘమొకటి వెళ్తుంది. ఆ తర్వాత మరొకటి. ఒకదాని తర్వాత ఇంకొకటి! ఈ మేఘాలన్నీ ఏకమై కలిసికట్టుగా ఆకాశాన్ని కప్పేసి బూడిద రంగులోకి మార్చేస్తాయి. వెంటనే ఎవరో భోరున ఏడుస్తున్నట్టు వర్షం మొదలవుతుంది; గంటల తరబడి పోస్టర్ నిండా కురుస్తున్న వర్షం తప్ప మరేదీ ఉండదు. ఎప్పుడో మెల్లగా వర్షం ఆగిపోతుంది. మళ్లీ ఫ్రేం మొత్తం నిర్మలంగా తయారవుతుంది. మబ్బుల చాటునుంచి సూర్యుడు బయటకొస్తాడు. ఆకాశంలో అప్పుడప్పుడూ మేఘాలు ప్రత్యక్షమవుతాయి. ఒక్కో సారి రెండు, మరో సారి మూడు. అప్పుడప్పుడూ అటుగా ఎగిరి వెళ్లే పావురాళ్లు; పిచుకలు. అంతే!

★

For Latest Telugu Books - Visit now:

Kinige
.com